## వర్షాల కోసం రేపు ముస్లింల ప్రత్యేక దుఆలు



యాడికి, జూలై 24 (అనంత ప్రభ)

యాడికి మండలంలో సకాలంలో వర్షాలు కురిసి కరువు పరిస్థితులు తొలగిపోవాలని కోరుతూ ఈనెల 26న (ఆదివారం) ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. జామియా మసీదు నుంచి చెప్పులు ధరించకుండా ప్రార్థనలు చేస్తూ ఊరేగింపుగా కోన రోడ్డులోని ఈద్గా మైదానానికి చేరుకుని, అక్కడ మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక దుఆలు నిర్వహించనున్నారు. రైతులకు సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని అల్లాను ప్రార్థించనున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ముస్లిం సోదరులందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు

## మూడు నెలల బాబు ఆరోగ్యం కోసం ఎనిమిదో తరగతి విద్యార్థిని చేయూత



యాడికి, జులై 24 (అనంత ప్రభ)

ఎస్ఎంఏ వ్యాధితో బాధపడుతున్న మూడునెలల బాబు చికిత్సకు ఎనిమిదో తరగతి విద్యార్థిని విశాలాక్షి తన వంతు సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకుంది. తాడపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరు మండలం కదిరిగుట్టపల్లి గ్రామానికి చెందిన నవీన్ తన మూడు నెలల కుమారుడు శ్యామ్ నందన్ అరుదైన ఎస్ఎంఏ టైప్ వ్యాధితో బాధపడుతున్నాడని, చికిత్సకు అవసరమైన ఇంజక్షన్ ధర సుమారు రూ.17 కోట్లు ఉంటుందని విజన్ విద్యాసంస్థల్లో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో వివరించారు. ఈ విషయం తెలుసుకున్న అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని విశాలాక్షి స్పందించి తన తండ్రి గుండా నారాయణస్వామి ద్వారా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించింది. ఆమె సేవాభావానికి చలించిన పలువురు తల్లిదండ్రులు కూడా తమకు తోచిన మేర విరాళాలు అందించి చిన్నారి చికిత్సకు చేయూతనిచ్చారు. విద్యార్థిని విశాలాక్షి చూపిన ఉదారతకు సమావేశంలో పాల్గొన్న వారు అభినందనలు తెలియజేస్తూ శ్యాం నందన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

## శ్రీ వాసవి అమ్మవారికి విశేష పూజలు



యాడికి, జూలై 24 (అనంత ప్రభ)

యాడికిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాస రెండో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో గంగా పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు.

మధ్యాహ్నం ఆర్యవైశ్య మహిళలు ఒక బృందంగా ఏర్పడి వెయ్యి తమలపాకులతో అమ్మవారికి నెమలి సింహాసనం ఏర్పాటు చేసి, లిల్లీ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహికంగా వడిబియ్యాన్ని సమర్పించి, వంద రకాల పిండి వంటలు, వివిధ రకాల పూలు, పండ్లు, కాయలు, పసుపు, కుంకుమ, సారెను అమ్మవారికి సమర్పించారు. అనంతరం మణిద్వీప వర్ణన, లలితా సహస్రనామావళి పారాయణం, రథోత్సవం, మహామంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను యాడికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు

## ఆషాఢ శుక్రవారం శ్రీ అంబా భవానీకి విశేష పూజలు



యాడికి, జూలై 24 (అనంత ప్రభ)

ఆషాఢ మాసం రెండో శుక్రవారం సందర్భంగా యాడికి మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీ సమీపంలో గల శ్రీ అంబా భవాని దేవాలయం భక్తులతో కళకళలాడింది. ఈ సందర్భంగా స్వకుల శాలియ వంశస్థులు శ్రీ అంబా భవాని అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన పూజా కార్యక్రమాల్లో స్వకులశాలియ వంశస్థులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రాకపోకలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది

## కేజీబీవీలో ఘనంగా మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రిన్సిపల్



ఆత్మకూరు, జులై 24 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల నందు శుక్రవారం రోజున జ్యోతి ప్రజ్వలన చేసి మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థినీలతో పాటు తల్లిదండ్రులు హాజరయ్యారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకం ప్రారంభించడం జరిగిందని ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్న అందరికీ తల్లికి వందనం వర్తింపజేయడం జరిగిందని ప్రిన్సిపల్ తెలిపారు. తల్లికి వందనం పథకం విద్యార్థినీల యొక్క బంగారు భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడుతుందని ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారని ఆమె అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వచ్చాక రాష్ట్ర విద్యాశాఖలో ఎన్నో నూతన మార్పులు తీసుకురావడం జరిగిందని కావున ప్రభుత్వం అందించే ఉచిత విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించి ప్రయోజకులు కావాలని ప్రిన్సిపల్ లీమా రోస్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

## విజన్‌లో ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం




యాడికి, జులై 24 (అనంత ప్రభ)

యాడికిలోని విజన్ విద్యాసంస్థల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులకు విద్యార్థులు ఘన స్వాగతం పలుకుతూ తల్లిదండ్రులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విజన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తన, భవిష్యత్ లక్ష్యాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెంపొందించే వేదికగా ఉపయోగపడాలని అన్నారు. ప్రతి తల్లితండ్రి రోజుకు కనీసం గంట సమయం పిల్లలతో గడుపుతూ వారి చదువు, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా టీనేజ్ వయసులో ఉన్న పిల్లలపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని, సెల్‌ఫోన్ వినియోగాన్ని నియంత్రించాలని, పాఠశాలలో ఎదురయ్యే సమస్యలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువచ్చి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలని కోరారు. మంచి పౌరులను తీర్చిదిద్దడమే అందరి లక్ష్యమని పేర్కొన్నారు.

సమావేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబాల్లోని విద్యార్థులకు ఆర్థిక సహాయం అందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 2026 పదో తరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించి కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ పురస్కారం అందుకున్న విజన్ విద్యార్థిని చిత్ర వర్షిణి మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహమే కారణమని పేర్కొంది. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించింది. ఆమె ప్రతిభను అభినందిస్తూ నాని అనే తల్లిదండ్రి రూ.1,016 నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. అలాగే పెద్దవడుగూరు మండలం కదిరగుట్టపల్లి గ్రామానికి చెందిన ఎస్ఎంఏ వ్యాధితో బాధపడుతున్న మూడు నెలల చిన్నారికి విజన్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అత్యవసర వేళ అండగా మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్




యాడికి, జులై 24 (అనంత ప్రభ)

అత్యవసర సమయంలో స్పందించి అరుదైన ఏ బి పాజిటివ్ రక్తాన్ని సమకూర్చి యాడికి ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులు మరోసారి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. యాడికికి చెందిన రాధ అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో తాడపత్రిలో చికిత్స పొందుతుండగా శస్త్రచికిత్సకు ముందు రక్తహీనత కారణంగా వెంటనే ఏ బి పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించారు. అరుదైన రక్తగ్రూప్ కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందగా వారు యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిర్వాహకులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫౌండేషన్ సభ్యులు రక్తదాతల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఫౌండేషన్ పిలుపునకు స్పందించిన దాసరి ఆంజనేయులు, బండారు లక్ష్మయ్య స్వచ్ఛందంగా ముందుకొచ్చి యాడికి నుంచి తాడపత్రికి చేరుకొని అక్కడి సేవ బ్లడ్ సెంటర్‌లో ఏ బి పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. సకాలంలో రక్తం అందడంతో వైద్యులు రాధకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండి కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. ఆపద సమయంలో ప్రాణదాతలుగా నిలిచిన రక్తదాతలు దాసరి ఆంజనేయులు, బండారు లక్ష్మయ్యతో పాటు, సమయానికి సహకరించిన మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులకు రాధ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు బండారు బాలకృష్ణ, కార్యదర్శి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, ప్రతినిధి కాల రవికుమార్ తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు

## వర్షాకాలము వ్యాధుల నివారణకు ఫ్రైడే డ్రైడే అప్రమత్తం




యాడికి, జూలై 24 (అనంత ప్రభ)

వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు వైద్యాధికారులు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు యాడికి మూడో సచివాలయ పరిధిలో తనిఖీలు చేపట్టి నీటి తొట్లలో దోమల లార్వాను గుర్తించి తొలగించారు. ప్రతి వారం నీటి నిల్వ పాత్రలను శుభ్రపరిచి గంటపాటు ఆరబెట్టిన తర్వాతే మళ్లీ నీరు నింపాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూ, మలేరియాను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సెక్టార్ సమావేశంలో ఏఎన్ఎంలకు ఆర్‌డీటీ కిట్లు పంపిణీ చేసి జ్వరాల పర్యవేక్షణను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్, మేరీ విజయకుమారి, ఎంపీహెచ్ఏ మద్దిలేటి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని హాజరైన మాజీ సర్పంచ్ వడ్డే రమాదేవి



కూడేరు, జులై 24 (అనంత ప్రభ)

కూడేరు మండల పరిధిలోని చోళసముద్రం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోజున మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ సర్పంచ్ వడ్డే రమాదేవి,హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వడ్డే రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకం ప్రారంభించడం జరిగిందని ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్న అందరికీ తల్లికి వందనం వర్తింపజేయడం జరిగిందని ఆమె అన్నారు. తల్లికి వందనం పథకం విద్యార్థుల యొక్క బంగారు భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడుతుందని ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారని ఆమె అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వచ్చాక రాష్ట్ర విద్యాశాఖలో ఎన్నో నూతన మార్పులు తీసుకురావడం జరిగిందని కావున ప్రభుత్వం అందించే ఉచిత విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని మాజీ సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్4.0 మీటింగ్‌కు హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి



శింగనమల, జూలై 24 (అనంత ప్రభ)

రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శిశీగనమల గౌరవ శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించినమెగా పేరెంట్స్ 4.0 మీటింగ్ కార్యక్రమం శిశీగనమల మండలం గుమ్మేపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తల్లికి వందన కార్యక్రమం ఇంటిలో ఎంతమంది అయితే చదువుతున్నారో ప్రతి ఒక్క విద్యార్థికి వర్తిస్తోందని ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు రవి పంచాయతీ కార్యదర్శి మోసిన్ స్కూల్ కమిటీ చైర్మన్ దేగలగణేష్ నాయకులు దేగల లక్ష్మయ్య తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జిప్‌హెచ్ఎస్ పెరవలిలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



శింగనమల, జూలై 24 (అనంత ప్రభ)

సింగనమల మండలం పరిధిలోని పెరవలి: గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెరవలిలో తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. "విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక్క అడుగు" అనే నినాదంతో ఈ సమావేశాన్ని నిర్వహించారు.

సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ గోరంట్ల మారుతి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని పిల్లల ప్రగతికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై చర్చించారు

## దివంగత ఆంధ్రజ్యోతి విలేఖరి నాగేష్ కు ఘన నివాళి



శింగనమల, జూలై 24 (అనంత ప్రభ)

శింగనమల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఈనెల 11 వ తేదీన గుండెపోటుతో అకాల మరణం పొందిన ఆంధ్రజ్యోతి విలేఖరి నాగేష్ కు సంతాప సభను నిర్వహించి ఆయన పత్రిక రంగంలో చేసిన సేవలను గుర్తు చేసుకొంటూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు ఈ కార్యక్రమంలో శింగనమల మండల అధికారుల తరఫున నాగేష్ కుటుంబానికి తమ వంతు సహాయంగా 80 వేల రూపాయలను కిసాన్ వికాసపత్ర పథకం కింద నాగేష్ కుమార్తె అయిన స్వాతిక పేరు మీద ఆ మొత్తాన్ని పిక్షుడ్ డిపాజిట్ చేస్తున్నట్లు మండల స్థాయి అధికారులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శింగనమల మండల రెవిన్యూ అధికారి శేషారెడ్డి మండల ఎంపీడీవో.భాస్కర్ ఈసీ దామోదర మరియు విలేఖరులు పాల్గొన్నారు